## క్లుప్తంగా

### ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన



**రేపల్లె రూరల్:** జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.8.74 కోట్లతో తాగునీటి వసతులు కల్పించేందుకు మండలంలోని పోటుమెరక మాదిగపల్లి, తుమ్మల పంచాయతీ బొందలగరువు, మోళ్ళగుంట పంచాయతీ అంబేద్కర్ కాలనీ, కట్టవ గ్రామాలలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ గురువారం ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 17 మిలటరీ మద్యం బాటిళ్లు స్వాధీనం



**నిజాంపట్నం:** అక్రమంగా మిలటరీ మద్యం విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన నిజాంపట్నంలో గురువారం చోటు చేసుకుంది. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో నిజాంపట్నంలో దాడులు నిర్వహించగా ఇరువురు వ్యక్తులు వేర్వేరు చోట్ల మిలటరీ మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 17 మిలటరీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, వెంకట రమణ, పెద్దయ్య, వాసుదేవరెడ్డి, గోపీకృష్ణ ఉన్నారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి



**కర్లపాలెం:** సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలని బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.లక్ష్మి చెప్పారు. కర్లపాలెం మండల పరిధిలోని పేరలి సమ్మెటవారిపాలెం గ్రామాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ రబీ సాగుగా చేపట్టిన మినుము, పెసర పైర్లలో తెగుళ్ల నివారణకు కృషి చేయాలని రైతులకు తెలిపారు. అపరాల పైర్లలో వచ్చే తెల్ల దోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు పొలంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. తలమాడు తెగులు నివారణకు నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయటం వలన తెగుళ్లను వ్యాప్తి చేసే దోమలు జిగురుకు అంటుకుపోయి నశిస్తాయని తెలిపారు. బంగారు తీగ నివారణకు సకాలంలో చర్యలు చేపట్టాలన్నారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ కలుపు మందు ఉపయోగించేటప్పుడు నేలలో తేమ ఉండాలని కలుపు మొక్కలు రెండు మూడు ఆకులు దశలో ఉన్నప్పుడు మందు పిచికారీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### పోరంబోకు స్థలంలో ఇళ్లు కూల్చవద్దు



**జంపని(వేమూరు):** కుమ్మరిగుంటలోని పోరంబోకు స్థలంలో వేసుకున్న ఇళ్లు కూల్చివేసేందుకు పంచాయతీ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. జంపని గ్రామంలో కుమ్మరి గుంటలో 20 సెంట్లు స్థలాల్లో ఇళ్లు వేసుకొని 7 కుటుంబాలు నివశిస్తున్నాయి.. ఇళ్లు కూల్చి వేయాలని పంచాయతీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో అదే గ్రామానికి చెందిన పోతునేని లక్ష్మీ తన స్థలం రిజిస్ట్రేషన్ అయిందని కాగితాలు పంచాయతీ అధికారులకు అందజేసింది. పంచాయతీ అధికారులు పరిశీలించి భూమి సర్వే నెంబరుకు, రిజిస్ట్రేషన్ డ్యాకుమెంట్ నెంబరుకు తేడా ఉందని, తన ఇల్లు కూడా కూల్చి వేయడం జరుగుతుందని హెచ్చరించారు. గురువారం ఆమె పంచాయతీ కార్యాలయం వద్ద గందరగోళం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత పేదలు పోరంబోకు స్థలాల్లో వేసుకున్న ఇళ్లను కూల్చి వేసే కుట్ర చేస్తుందని ఆమె ఆరోపించింది. కొన్ని సంవత్సరాలుగా కుమ్మరిగుంటలో ఉంటున్న తమ ఇళ్లు తొలగించరాదని ఆమె పంచాయతీ అధికారులను కోరగా.. తొలగించక తప్పదన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రెహమాన్‌ను వివరణ కోరగా హైకోర్టు 2023 ఏప్రిల్ 4వ తేదిన ఇళ్లు తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నవంబర్ నెలలో నోటీసులు అందజేయగా బాధితులు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని, రెండవ నోటీసు జనవరి 4వ తేదీన పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కూల్చి వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

# ల్యాండ్ కన్వర్షన్‌లు నిల్.. ఆదాయం ఫుల్

- నిబంధనలకు మంగళం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- డ్రైనేజ్ వ్యవస్థకు ముప్పు



కొల్లూరు పెట్రోలు బంకల ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్

**కొల్లూరు :** భూముల క్రయ, విక్రయాలలో అనుమతులకు మంగళం పాడి యథేచ్ఛగా లే అవుట్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. దీంతో కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొల్లూరు ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల కారణంగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా భూమి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఎటువంటి అనుమతులు పొందకుండా లే అవుట్‌లు వేసి ప్లాట్‌లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొల్లూరు పెట్రోల్ బంక్‌ల ప్రాంతంలో బొద్దులూరుపాడు అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన లే అవుట్‌లో పంచాయతీ యంత్రాంగం మీనమేషాలు లెక్కించి సీఆర్‌డీఏ అనుమతులు లేవని గురువారం హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి వెంటనే తొలగించటం వెనుక అధికార కూటమి పార్టీ నాయకుల ఒత్తిళ్లే కారణమని స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

#### నిబంధనలకు మంగళం

భూ యజమాని నుంచి పొలాలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు తొలుత భూమి మార్కెట్ ధరలో 3 శాతం రెవెన్యూ శాఖకు చెల్లించి ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాల్సి ఉంది. అయితే ల్యాండ్ కన్వర్షన్ ఏర్పాటు చేయకుండానే నియోజకవర్గంలోని పలు మండలాల్లో లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికార యంత్రాంగం మిన్నకుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందుగా వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయించిన అనంతరం సీఆర్‌డీఏ నిబంధనల మేరకు లే అవుట్‌లో 30 అడుగుల రోడ్డుతో పాటు, వెంచర్ వేసిన భూమి విస్తీర్ణాన్ని బట్టీ పంచాయతీకి కొంత భూమిని అప్పగించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు మాత్రం తూతూమంత్రంగా రోడ్లు వేసి ప్లాట్లు అధిక ధరలకు విక్రయించుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వడంతో కొనుగోలుదారులు నష్టపోవాల్సి వస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



మురుగు వెళ్లాల్సిన డ్రైనేజీను పూడ్చి ఏర్పాటు చేసిన నామమాత్రపు తూములు

#### డ్రైనేజ్ వ్యవస్థకు ముప్పు

వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి కొల్లూరు పెట్రోల్ బంక్‌ల సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో నిబంధనలను పూర్తిగా అతిక్రమించడంతో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్థమవుతుంది. కొల్లూరు నుంచి పారుదల జరిగే మురుగు కాలువ మీదుగా లే అవుట్ వేశారు. గ్రామంలో మూడొంతుల మురుగు ప్రవాహానికి ఉపయోగపడే డ్రైనేజ్‌ను పంచాయతీ అనుమతులు లేకుండా నామమాత్రపు తూములు వేసి పూడ్చివేయడంతో మురుగు పారుదలకు తీవ్ర అడ్డంకులు ఏర్పడనున్నాయి. సాధారణ పరిస్థితుల్లో మురుగు కదలక మొరాయించే ముప్పు ఉండటంతోపాటు, వర్షాలు సంభవిస్తే గ్రామం మొత్తం మురుగు సమస్యతో సతమతం అవ్వాల్సిన దుస్థితి ఏర్పడనుంది.

#### ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు అందలేదు

కొల్లూరు సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్ విషయంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం ఎటువంటి దరఖాస్తు అందలేదు. వ్యవసాయ భూమిలో బుసక తోలి డెవలెప్ చేస్తున్నారన్న సమాచారంతో సిబ్బందిని నిలుపుదల చేయించాలని ఆదేశించాం. లే అవుట్ భూమి వ్యవసాయ భూమి అయినందున అధికారికంగా ఎటువంటి అనుమతులు మంజూరు అవలేదు.

– బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు

# అధికారులు ప్రొటోకాల్ పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు బాపనయ్య

**ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య**

**నగరం:** అధికారులు ప్రొటోకాల్ పాటించి ఎంపీటీసీ, సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. ఎటువంటి పదవులు లేని అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ తీర్మానాలు లేకుండా గోకులం షెడ్లులను నిర్మిస్తున్నారని వీటికి నిధులు ఎలా మంజూరు చేస్తారని అధికారులను ప్రశ్నించారు.

- నగరం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ మాన్యంవారిపాలెంలో ప్రాథమిక పాఠశాల మూసివేయడం వల్ల విద్యార్థులు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కారంకివారిపాలెం పాఠశాలకు వెళ్లాల్సివస్తోందని పాఠశాలను పునరుద్ధరించాలని కోరారు.
- అద్దంకివారిపాలెం ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య అధికారులు తమకు ఎంటువంటి సమాచారం ఇవ్వడం లేదని, రేపల్లె ప్రధాన మురుగు కాల్వ న్యూకోర్స్ కాల్వకట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయశ్రీ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ గ్రామ పంచాయతీ నిధులను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. గ్రామ వీఆర్వో వై.పోతురాజు కౌలు రైతు కార్డులు ఇవ్వాలంటే టీడీపీ నాయకులు సిఫారస్ చేస్తేనే ఇస్తామనడం ఏంటని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాపనయ్య సమావేశంలో తెలిపారు.
- మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరవ్వడం పట్ల ఎంపీపీ శ్రీకృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నేడు ఏబీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆటల పోటీలు

**రేపల్లె రూరల్:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు ఆధ్వర్యంలో అహ్మదీయ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సహకారంతో ఈ నెల 24వ తేదీ శుక్రవారం పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో యువతకు పలు అంశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేయబడునని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలని చెప్పారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్**



కబడ్డీలో విద్యార్థులతో తలపడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్

**రేపల్లె రూరల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ అన్నారు. పట్టణంలోని భాష్యం స్కూలులో ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్న వార్షిక క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. ఆటల వలన మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యం కలుగుతాయని, నిత్యం కొంత సమయాన్ని ఆటలకు కేటాయించాలని సూచించారు. విద్యార్థి దశ ఎంత కీలకమని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. భాష్యం స్కూలు జోనల్ ఇన్‌చార్జ్ హృదయరాజ్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులను ఉత్తేజ పరుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. తొలుత పట్టణంలో స్పోర్ట్స్ మీట్ ర్యాలీ నిర్వహించారు.

# వార్డులలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



23వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్



24వ వార్డు వాడ మురుగు డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

సాక్షి ఎఫెక్ట్

**రేపల్లె రూరల్:** పట్టణంలోని 23, 24 వార్డులలో అధ్వాన్నంగా ఉన్న పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఈ నెల 23న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన 'పారని మురుగు.. పట్టని అధికారులు' కథనానికి అధికారుల నుంచి స్పందన లభించింది. మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా మలేరియా అధికారులూ స్పందించారు. ఆయా వార్డులలో గురువారం స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్యం మెరుగుపరిచి బ్లీచింగ్, సున్నం చల్లించారు. దోమల నివారణకు అయా డ్రెయిన్‌లలో ఫినాయిల్, ఆయిల్ బాల్స్‌ను వేయంచారు. కార్యక్రమాలను జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్ పర్యవేక్షించి మాట్లాడారు. దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. దోమల ఉధృతితో అంటు వ్యాధులు, విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి వారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేయాలన్నారు. దోమల నివారణకు చేపట్టే కార్యక్రమాలపై మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాంబశివరావుతో చర్చించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ కృష్ణయ్య, డీపీఎంవో సారంగపాణి, వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ యల్లయ్య, పద్మావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, డాక్టర్ రమేష్, షాహిని, ఆశాలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ జయంతి వేడుకలు

**నగరం:** నేతాజీ సుభాష్ చ్రంవబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఫర్ట్ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ అడుసుమల్లి ప్రభాకరరావు చెప్పారు. స్థానిక శిక్షణ కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం, సీఫర్ట్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు ఇండియన్ నేషనల్ ఆర్మీ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. యువత నేతాజీ, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ లాంటి యోధుల త్యాగాన్ని గుర్తించాలన్నారు. తొలుత సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవదానం తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఫర్ట్ శిక్షణ కేంద్ర సిబ్బంది



భట్టిప్రోలులో నేతాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్థానికులు

#### నేతాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి

**భట్టిప్రోలు (కొల్లూరు) :** దేశ స్వతంత్రం కోసం పాటు పడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు భట్టిప్రోలులో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక స్ఫూర్తి స్థల్ వద్ద వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, స్థానికులు ఈ సందర్భంగా నేతాజీ త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్ ఏర్పాటు చేసి బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన నేతాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ నేతృత్వంలో రిపబ్లిక్‌డే ను పునస్కరించుకొని భరతమాతకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, రావూరి సత్యనారాయణమూర్తి, కొతరపు చిదంబరం, చెన్ను ఉమామహేశ్వరరావు, వంగర నాగేశ్వరరావు, ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు తదితరులు పాల్గొన్నారు.

#### స్వాతంత్రోద్యమంలో బోస్ సేవలు వెలకట్టలేనివి

**రేపల్లె రూరల్:** దేశ స్వాతంత్రోద్యమంలో సుభాష్ చంద్రబోస్ సేవలు వెలకట్టలేనివని, స్వాతంత్ర్య సముపార్జనకై కృషి చేసిన మహనీయుడని బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బేతపూడి వెంకటేశ్వరరావు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్ కాలనీలోని చంద్రబోస్ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అచంచలమైన దేశభక్తిని కలిగి, దేశం కోసం కృషి చేసిన మహనీయుడు బోస్ అని, ఆయన్ని యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్నం సాయి, కారుమూరి నాగలీల, ప్రసాద్, ఎం.సురేష్, కిషోర్, శివరామ ప్రసాద్, వాకా శివరామకృష్ణ పాల్గొన్నారు.



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**చుండూరు(వేమూరు):** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు అందరు నిర్వహించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కుర్రా శ్రీనివాసరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నేతాజీ జయంతి వేడుకలు అఖిల భారతీయ పూర్వ సైనిక్ సేవా పరిషత్ వారు ఘనంగా నిర్వహించారు. ఏపీ సైనిక సేవా పరిషత్ అధ్యక్షుడు కల్నల్ పాలేటి రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సి.బలరాం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్నల్ రవి, ఫ్లైట్ లెఫ్టినెంట్ నాగరాజు, జిల్లా సైనిక సేవా పరిషత్ అధ్యక్షుడు వి.ఆది నారాయణ, ఐ.రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకే సర్వేలు

**జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య**



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య

**బాపట్ల :** దివ్యాంగుల పింఛన్లు జోలికి వస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చల్లా రామయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రీ సర్వేల పేరుతో దివ్యాంగులను అన్యాయం చేయాలని చూస్తోందని తెలిపారు. సదరం సర్టిఫికెట్లు తీసుకుని పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను మళ్లీ సర్వే చేయాల్సిన అవసరం ఏమిటో అర్థం కావటం లేదన్నారు. పింఛన్లు కూడా పర్సంటేజీల ప్రకారం ఇచ్చేందుకు కుట్ర జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగులకు పర్సంటేజీలతో సంబంధం లేకుండా పింఛన్లు ఇచ్చిందని తెలిపారు. పింఛన్లు జోలికి వస్తే న్యాయ పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల నాయకులు మల్లెల మౌనిక, కొండముది ఆదం, తాత నాగరాజు, జిలకర ఉమాచంద్ర, అక్కల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులతో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం



**రేపల్లె రూరల్:** ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యల సాధనకై కృషి చేయటం జరుగుతుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి, పీడీఎఫ్ నాయకులు కేఎస్ లక్ష్మణరావు పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో పట్టభద్రులతో గురువారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. 2007 నుంచి పీడీఎఫ్ పేరుతో రాష్ట్రంలో ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, రైతుల సమస్యలపై పలుమార్లు శాసన మండలిలో పోరాటం జరిగిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులలో శాసనమండలిలో పోరాడాలంటే ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, జిల్లా కార్యదర్శి అడుగులు శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రూనీ్, వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నేడు సుకన్య సమృద్ధి యోజన మేళా

**అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.ఏడుకొండలు**



**రేపల్లె రూరల్:** రేపల్లె పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 24న సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.ఏడుకొండలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ మేళాలో జిల్లా వ్యాప్తంగా 3,500 సుకన్య సమృద్ధి ఖాతాలు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పదేళ్ల లోపు వయసు గల బాలికల పేరుతో ఈ ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. కాల పరిమితి 21 ఏళ్లని తెలిపారు. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఉన్నత విద్య కోసం ఉన్న మొత్తంలో 50 శాతం వరకు విత్‌డ్రా చేసుకోవచ్చన్నారు. వివాహానికి నెల రోజులు ముందు గానీ, వివాహానంతరం మూడు నెలల్లోపు పథకాన్ని ఉపసంహరించుకునేందుకు వీలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.250 నుంచి గరిష్టంగా రూ.1,50,000 వరకు చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకై సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

**కర్లపాలెం:** విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కర్లపాలెం ఎస్సై ఏ రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం మండలంలోని బోలాయపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని పిట్టలవానిపాలెం మండల పరిధిలోని డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం విద్యార్థిని జిరాక్స్ తీసుకుని వస్తానని ఇంటిలో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఎలాంటి ఫలితం లేదు. తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.